# మళ్ళీ పూర్వపు అణచివేత వుంటుందనుకోము

'ఎన్‌కౌంటర్' తదితర అంశాలపైన 'ఆంధ్రజ్యోతి' సచిత్ర వారపత్రిక బాలగోపాల్, కన్నాభిరాన్, వరవరరావు లతో జరిపిన 'ఇంటర్వ్యూ'ను వరుసగా ప్రచురిస్తున్నది. మొదట బాలగోపాల్ 'ఇంటర్వ్యూ'ను ప్రచురిస్తున్నాము.

**1) నిజామాబాద్ ఎన్‌కౌంటర్‌తో మళ్ళీ ఎన్‌కౌంటర్ల పర్వం ప్రారంభమైందనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ పాలసీగానే ఎన్‌కౌంటర్లు ప్రారంభించిందని అనుకుంటున్నారా? లేక చెన్నారెడ్డి లేని సమయంలో కొందరు పోలీసు అధికారులు మరోసారి తమ 'తడాఖా'ను చూపడానికో, పాత కక్షలు తీర్చుకోవడానికో ఈ పని చేసివుండొచ్చనుకుంటున్నారా?**

ఈ ప్రశ్నకు కొంచెం వివరంగానే జవాబు చెప్పవలసిన అవసరం వుంది.

నిజామాబాద్ ఎన్‌కౌంటర్ కాంగ్రెస్ పాలనలో మొదటి 'ఎన్‌కౌంటర్' కాదు. మే నెల 8వ తేదీన అనంతపురం జిల్లా ధర్మవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓబులనాయునిపల్లిలో ఒక ఎన్‌కౌంటర్ జరిగి కేశవ నాయర్ అనే గిరిజన యువకుడు చనిపోయాడు. అప్పటికి చెన్నారెడ్డి ఇంకా విదేశాలకు పోలేదు. కాబట్టి ఇదేదో చెన్నారెడ్డి 'లేని సమయంలో' పోలీసులు చేసిన కుట్ర కాదు. అనంతపురం నిజామాబాద్ సంఘటనలే కాక గత 6 నెలల కాలంలో మరొక 6 సార్లు నక్సలైట్లూ పోలీసులూ పరస్పరం కాల్పులు జరుపుకున్నట్టు వార్తలొచ్చాయి. అందులో నిజంగా ఒకరి మీద ఒకరు జరుపుకున్న కాల్పులెన్నో, పోలీసులు ఏక పక్షంగా జరిపిన కాల్పులెన్నో తెలియదు.

అన్ని రాజకీయ విషయాలనూ వ్యక్తుల పరంగా చర్చించడం మనకు పట్టుకున్న దురలవాటు. దానివల్ల ప్రయోజనమేమీ వుండదు. ఒక నిర్ణయం వెనక ఎన్నో ఒత్తిడులుంటాయి. ఆ ఒత్తిడుల మధ్యనుండే బలాబలాల సమతుల్యం మారుతూ వుంటుంది. చుట్టూ వున్న వాతావరణం మారుతూ వుంటుంది. దీనినంతటినీ దృష్టిలో పెట్టుకుని చూస్తేనే ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు అర్థమవుతాయి.

నక్సలైట్ల విషయంలో 20 ఏళ్ళపాటు ప్రభుత్వాలు ఒకమూర్ఖమయిన విధానాన్ని అనుసరిస్తూ వచ్చాయి. కొట్టి, తన్ని, తప్పుడు కేసులలో ఇరికించి, ఇళ్ళు తగలబెట్టి, పొలాలు బీడు పెట్టి, సంపద లూటీ చేసి, ఎన్‌కౌంటర్లలో చంపి, అణచి వేయాలని చూసారు. అది ఫలించకపోగా చివరికి పాలకుల మెడకే వచ్చి చుట్టుకుంది. అణచివేత ఎంత హింసాత్మకంగా వుంటే ప్రతిఘటన కూడా అంత హింసాత్మకంగా తయారయింది. ఈ హింసా ప్రతిహింసల వలయం నుండి రాష్ట్రాన్ని బయట పడేయలేరా అని సామాన్య ప్రజలే ప్రభుత్వాన్ని నిలదీయడం మొదలు పెట్టారు. దీనికి స్పందించక తప్పదని మొట్ట మొదట గుర్తించింది చెన్నారెడ్డి కాదు ఎన్టీఆరే. ఆయన పాలనలో చివరి భాగంలో ఎన్‌కౌంటర్లు బాగా తగ్గాయి. అయితే మొత్తంగా ప్రభుత్వ విధానాన్ని గురించి పునరాలోచన చేపట్టడం ఆయన హయాంలో జరగలేదు. చెన్నారెడ్డి పదవికి రాగానే ఆ కర్తవ్యాన్ని చేపట్టినట్టు బహిరంగంగా ప్రకటించుకున్నాడు. నలుగురినీ పిలిచి మాట్లాడాడు. చట్టబద్ధమైన కార్యక్రమాలను అనుమతించడం, చట్ట వ్యతిరేకమయిన చర్యలను అరికట్టడం తమ విధానమని ప్రకటించారు. అవకాశం దొరికినప్పుడల్లా ప్రభుత్వ విధానంలో వచ్చిన ఈ మార్పును నొక్కి చెపుతూ వచ్చాడు.

ఈ మార్పుకు కాలం చెల్లిపోయిందని మేము అనుకోవడం లేదు. ఇది ఒకరి వ్యక్తిగత మయిన నిజాయితీకి సంబంధించిన విషయం కాదు. సమస్యే ఇవ్వాళ ఈ స్థాయికి ఎదిగింది. ఎవరికి ఇష్టమున్నా లేకున్నా శ్రీకాకుళ పోరాటం నాటికీ నేటికీ నక్సలైట్ ఉద్యమం ప్రభావంలోనూ ప్రజలలోని తిరుగుబాటు తత్వంలోనూ ఈ ఎదుగుదల వచ్చింది.

అయితే ప్రభుత్వం ఏవిధానాన్ని అనుసరించినా అందులో అంతర్గతంగా

అణచివేత ఎంత హింసాత్మకంగా వుంటే ప్రతిఘటన కూడా అంతహింసాత్మకంగా తయారయింది. ఈ హింసా ప్రతిహింసల వలయం నుండీ రాష్ట్రాన్ని బయటపడేయలేరా అని సామాన్య ప్రజలే ప్రభుత్వాని నిలదీయడం మొదలు పెట్టారు.




చట్ట వ్యతిరేకమైన చర్యలను అరికట్టవద్దని ఎవరూ అనరు. అయితే, అందుకోసం చట్టబద్ధమైన హక్కులను కూడా హరించక తప్పదని భావించడం గత 20 ఏళ్ళుగా ప్రభుత్వం చేసిన ఘోరమైన పొరపాటు.

వైరుధ్యాలూ సంక్షోభమూ వుండకుండా పోవు. 'చట్టబద్ధమయిన కార్యక్రమాలను అనుమతించడం, చట్ట వ్యతిరేక మయిన చర్యలను అరికట్టడం' అనేది అనాక్షేపణీయమయిన విధానంగా అనిపిస్తుందిగానీ, చట్టబద్ధమయిన కార్యక్రమాలను అనుమతిస్తూ పోతే కొన్నాళ్ళకు చట్ట వ్యతిరేకమయిన వాటిని నిరోధించలేని స్థితి ఏర్పడుతుందనే భయం పాలకులలో సహజంగానే వుంటుంది. అడవి భూములు, ప్రభుత్వ భూములు, భూస్వాములు ఆక్రమించుకుంటూ పోతే పాలక వర్గాల ఆస్తులు మిగలవనీ, ప్రజా కోర్టుల ద్వారా తప్పో ఒప్పో ప్రజల సమస్యలను పరిష్కరించుకుంటూ పోతే పోలీస్-అధికార్లకూ రాజకీయ నాయకులకూ ప్రాబల్యం మిగలదనీ, పాలకులలో భయం వుంటుంది.

ఈ ఒత్తిడులన్నీ ఒకేసారి పనిచేస్తూ వుంటాయి. వీటిలో రాజకీయ నాయకులు ఒకవైపూ పోలీసులు మరొక వైపూ వున్నారనిగానీ, ఈ రెడ్డి ఒకవైపూ ఆ రెడ్డి ఇంకొక వైపూ వున్నాడనిగానీ భావించడం వారి వారి రాజకీయ ప్రయోజనాలకు తప్ప వేరే దేనికీ పనికిరాదు. దాని బదులు పరిస్థితులు మారే కొద్దీ ఈ ఒత్తిడుల మధ్య సమతుల్యం ఏరకంగా మారుతూ వుంటుందని చూడాలి.

ఇప్పుడొక నెలన్నరగా క్రమంగా అణచివేత పెరుగుతూ వుంది. నిష్కారణంగా సభలను రద్దు చేస్తున్నారు. 144 సెక్షన్ ప్రయోగిస్తున్నారు. అరెస్టులూ లాఠీఛార్జీలు చేస్తున్నారు. లాకప్పులలో కొడుతున్నారు. ఎన్‌కౌంటర్లు కూడా చేస్తున్నారు. అనంతపురం ఎన్ కౌంటర్ కూడా బూటక మయినదేగానీ, నిజామాబాద్‌లో జరిగింది పూర్తిగా ఉద్దేశ్యపూర్వకంగా చేసిన హత్యే.

చట్ట వ్యతిరేకమయిన చర్యలను అరికట్టవద్దని ఎవరూ అనరు. అయితే అందుకోసం చట్టబద్ధమయిన హక్కులను కూడా హరించక తప్పదని భావించడం గత 20 ఏళ్ళుగా ప్రభుత్వం చేసిన ఘోరమైన పొరబాటు. దానివల్ల లక్షలాది ప్రజానీకం క్షమించరాని హింసనూ అణచివేతనూ అనుభవించారు. ప్రభుత్వ విధానం తిరిగి మళ్ళీ ఆ దశకు వెళ్ళిపోయిందని మేము అనుకోవడం లేదు. పరిస్థితుల స్థాయి అందుకు అనుకూలంగా లేదు. నక్సలైట్ ఉద్యమానికుండే బలం మట్టుకే కాదు, మొత్తంగా రాష్ట్రంలో వున్న ప్రజా చైతన్యమూ భావ వాతావరణమూ అందుకు అనుకూలంగా లేదు. ముఖ్యమంత్రి కుర్చీలో చెన్నారెడ్డి కూర్చున్నా వేరే ఎవరు కూర్చున్నా నూటికి నూరు శాతం తిరోగమనం సులభంగా సాధ్యం కాదు. అయినప్పటికీ చట్టవ్యతిరేకమయిన చర్యలను అరికట్టడం అనే పేరు మీద ప్రజల హక్కులపైన దాడులు పెంచబోతారనేది స్పష్టంగానే వుంది.



భూముల పంపకం చేపట్టినందువల్లే ఎన్‌కౌంటర్లు మొదలయ్యాయా? పి.వి. నరసింహారావు, హయగ్రీవాచారి లాంటి నాయకుల భూములు కూడా అన్యాక్రాంత మయ్యాయని, అందుకే ఎన్‌కౌంటర్లకై ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగిందని ఒక వదంతి ప్రచారంలో వుంది. ఎంత వరకూ నిజం?

○ ఇందులో చాలా వాస్తవం వుందని నేను అనుకుంటున్నాను. ఒక్క ఎన్ కౌంటర్లే కాదు, గత నెల రోజులుగా అన్ని రకాల నిర్బంధం పెరగడానికి ఇదొక ముఖ్యకారణం. పాటలు పాడుకోండి, మాటలు చెప్పుకోండి, కానీ మా భూముల మీదికి రావద్దు అని అంటున్నారు మన రాష్ట్రాన్ని ఏలేవాళ్ళు. భూముల ఆక్రమణ మొదలయిన తరువాతే కాంగ్రెస్ తెలుగుదేశం పార్టీల స్థానిక నాయకులు రాష్ట్రంలో శాంతి భద్రతలు లేకుండా పోయాయని గగ్గోలు పెట్టడం మొదలుపెట్టారు.

ఎన్‌కౌంటర్లు మళ్ళీ మునుపటిలాగా ఎక్కువ సంఖ్యలో జరిగితే మీరు తీసుకోబోయే చర్యలేమిటి?

○ గతంలో లాగే రాష్ట్రంలోనూ బయటా ప్రచార కార్యక్రమం చేపడతాం. అవకాశాన్ని బట్టి కోర్టుల జోక్యం కోరతాం. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి అంతర్జాతీయ పౌర హక్కుల సంస్థలను రాష్ట్రానికి ఆహ్వానిస్తాం. గత 20 ఏళ్ళలో జరిగిన అన్ని ఎన్‌కౌంటర్లపైనా (మదనపల్లితో ఈ సంఖ్య 661కి చేరుకుంది) సుప్రీం కోర్టు న్యాయ మూర్తి చేత విచారణ జరిపించాలని డిమాండు చేస్తూ ఆందోళన కొనసాగిస్తాం. గతంలో కంటే ఇప్పుడు పౌర హక్కుల ఉద్యమం బలంగా వుంది కాబట్టి ఈ పనులన్నీ ఇంకింత సమర్థవంతంగా నిర్వహించగలుగుతామని భావిస్తున్నాము.

పీపుల్స్‌వార్ పార్టీగానీ, మరో నక్సలైట్ పార్టీగానీ వీటిని ఎలా ఎదుర్కొంటుందని మీరు ఊహిస్తున్నారు? ఇదివరకటిలాగా మళ్ళీ కిడ్నాప్‌లు చేస్తారని భావిస్తున్నారా? అంతకంటే తీవ్రమైన చర్య ఏదైనా తీసుకోవచ్చా?

○ వాళ్ళ వ్యూహాల గురించీ ఎత్తుగడల గురించీ ఊహించడం మాకు సాధ్యం కాదు.

పోలీసులు మీలాంటి ప్రజా సంఘాల నాయకుల్ని గతంలో లాగా కౌంటర్ కిడ్నాప్‌లు చేస్తే...? గతానుభవం దృష్ట్యా మీరు వీటిని ఎలా నివారించగలరు?

○ ప్రభుత్వం పౌరులలో ఎవరినయినా ఏమైనా చేయదల్చుకుంటే దానికి నివారణోపాయం అంటూ ఏదీ వుండదు. అయితే మనం నిలబడ్డది న్యాయం కోసమే తప్ప మన స్వార్థం కోసమో ఒకరికి ద్రోహం చేయడం కోసమో కాదనే విశ్వాసాన్ని ప్రజలలో విస్తృతంగా నిలబెట్ట గలిగితే బలమయిన ప్రజాభిప్రాయమే ఒక మేరకు రక్షణగా పని చేస్తుంది. ఆ ప్రయత్నంలో మేము ఎప్పుడూ వున్నాము.

ప్రతి ఎన్‌కౌంటర్‌నీ 'ఆత్మరక్షణ' కోసం జరిపిన కాల్పులనే పోలీసులు చెబుతున్నారు. అదే నిజమైతే అలా అని రుజువు చేసుకోవలసిన బాధ్యత పోలీసులకు వుందనీ, అంతవరకూ దాన్ని హత్యానేరంగా పరిగణించి కేసు నడపాలనీ మీరూ, మీ సంఘాలూ డిమాండ్ చేస్తున్నాయి. ఆ పని స్వయంగా మీరే చేయకపోవడానికి చట్టపరమైన ఇబ్బందులు ఏమైనా వున్నాయా?

○ స్వయంగా చేయడం అంటే 'ఎన్ కౌంటర్' మృతుల కుటుంబాల చేత స్థానిక కోర్టులలో పోలీసుల మీద హత్య కేసు పెట్టించడం, సాక్ష్యాలన్నీ నమోదయ్యేలాగ చూసి విచారణ జరిపించడం దీనికి చట్టపర మైన ఇబ్బందులేమీ లేవుగానీ ఆచరణలో చాలా కష్టం. పోలీసుల మీద హత్య కేసు పెట్టి ప్రాణాలతో బయట పడడం కష్టం. అందులోనూ ఎన్‌కౌంటర్ మృతులు ఎక్కువగా పేదవాళ్ళు కావడం వల్ల వాళ్ళ బంధువులకు పోలీసుల ఒత్తిడిని తట్టుకోవడం చాలా కష్టం.

అందుకే ఒక ప్రత్యామ్నాయ ప్రయత్నంగా సుప్రీం కోర్టులో రెండు సార్లు ఎన్‌కౌంటర్ల మీద రిట్ పిటిషన్లు వేశాం. ఎన్‌కౌంటర్లను హత్యలుగా భావించి సంబంధిత పోలీస్ అధికార్ల మీద 302 కేసులు పెట్టి అరెస్టు చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి రిట్ జారీ చేయమని సుప్రీం కోర్టును కోరాము. కాని సుప్రీం కోర్టు రెండు సార్లు కూడా 'కర్ర విరగకుండ పాము చావకుండ' అన్నట్టు ఇరుపక్షాలకూ హితోపదేశం చేసి ఊరుకుంది.

**ఆర్వాల్, మీరట్, చింతపల్లి సంఘటనల మీద జరిపినట్టుగా మానవ హక్కుల ట్రిబ్యునల్ చేత ఆంధ్రప్రదేశ్ ఎన్‌కౌంటర్ల మీద విచారణ జరిపించే ఉద్దేశం ఏమైనా వుందా?**

మానవ హక్కుల ట్రిబ్యునల్ ప్రైవేట్‌గా జరిగే విచారణ కాబట్టి సాక్ష్యాలు బలంగా వున్న కేసులు మాత్రమే చేపడుతూ వుంది. లేకపోతే అదొక ప్రహసనంగా తయారయ్యే ప్రమాదం వుంది. 'ఎన్‌కౌంటర్ల' విషయంలో బలమయిన సాక్ష్యాలు దొరకడం కష్టం. అయితే ఇప్పుడిప్పుడే పంజాబులో ఎన్‌కౌంటర్ల మీద విచారణ జరిపే ఆలోచన వుంది. అది సఫలమైతే ఇక్కడా ప్రయత్నం చేయవచ్చును.

**ప్రభుత్వ అణచివేత విధానాల్లో ఎన్‌కౌంటరే తీవ్రమైనదా? అవి జరగనప్పుడు అణచివేత తక్కువగా వున్నట్టేనా?**

అన్ని రకాల అణచివేతల లోనూ ప్రాణం మిగలకుండా చేసేది తీవ్రమయినదే. ఇతర రూపాల అణచివేత తీవ్రంగా వుండి ఎన్‌కౌంటర్లు జరగక పోవడం అనేది ఎప్పుడూ లేదు.

**చెన్నారెడ్డి ఇచ్చిన స్వేచ్ఛను నక్సలైట్లు దుర్వినియోగం చేశారన్న విమర్శపై మీ అభిప్రాయం ఏమిటి?**

ప్రజల స్వేచ్ఛ చెన్నారెడ్డి స్వంత ఆస్తి కాదు. అది ప్రజలు పోరాడి సాధించుకున్న ప్రాథమిక హక్కు. దానిని సద్విని యోగం చేస్తారో దుర్వినియోగం చేస్తారో ప్రజల ఇష్టం. ఏది సద్వినియోగమో ఏది దుర్వినియోగమో ఎవరు చెప్పాలి?

**నక్సలైట్లు ప్రజా కోర్టులు నిర్వహించి తీర్పులు చెప్పడం చాలా విమర్శలకు గురయింది. వాటికి కారణం — న్యాయ వ్యవస్థకు వెలుపల ఇలాంటి పనులు జరగడం తప్పు అనా? లేక న్యాయ నిర్ణయానికి నక్సలైట్లు ఎంచుకుంటున్న సమస్యలా?**

గ్రామాలలో పంచాయతీలు శతాబ్దాలుగా జరుగుతున్నాయి. భూస్వాముల పంచాయతీలు, కులం పెద్దల పంచాయతీలు, పెత్తందార్ల పంచాయితీలు, చాలాకాలంగా జరుగుతూ వున్నవే. పెత్తందార్లకు ఆస్తులూ రాజకీయ ప్రాబల్యమూ సంపాదించి పెట్టాయి పంచాయతీలు. ఇవ్వాళ వివిధ పాలక పార్టీలలో నాయకులుగా వున్నవాళ్ళు చాలామంది తొలుత ఈ రూపంలో ప్రాబల్యం సంపాదించుకున్నవాళ్ళే! పంచాయతీల ద్వారా రాజకీయ ప్రాబల్యాన్ని నిలబెట్టుకుంటున్న వాళ్ళే. ఈ పెద్ద మనుషుల పంచాయతీలతో విసుగు చెందిన ప్రజానీకం ప్రత్యామ్నాయం కోసం వెతుకుతూ వుంటారు. అందులో భాగంగా వచ్చినవి నక్సలైట్ల ప్రజా కోర్టులు. భూస్వాముల పంచాయతీల నుండి నక్సలైట్ల ప్రజా కోర్టులు దాకా అన్నీ కూడా బ్రిటిష్ వారు ప్రవేశ పెట్టిన కోర్టులకు ప్రత్యామ్నాయంగా ఒక సమాంతర న్యాయ వ్యవస్థగా కొనసాగుతున్నాయి. ఇది 'తప్పు' అనుకుంటే నక్సలైట్లేకాదు, చాలామంది పెద్ద మనుషులు జైలుకు పోవలసి వుంటుంది.

ఇక విమర్శల మాట కొస్తే దానికి రెండు కారణాలున్నాయి. ప్రజా కోర్టులలో ఒకొక్కసారి సున్నితమయిన వ్యక్తిగత సమస్యలను మొరటుగా పరిష్కరించడం, దొంగతనం మొదలయిన నేరాలకు అమానుషమయిన భౌతిక దండన విధించడం, సమస్యను పూర్తిగా అధ్యయనం చేయకుండా తొందరపడి పరిష్కారం చేయడం జరుగుతూ వుంది. ఇది తప్పే. తప్పని సరిగా విమర్శించవలసిందే.

అయితే ప్రస్తుతం వినవస్తున్న విమర్శకు ఇంత కంటే ముఖ్యమయిన కారణం మరొకటి వుంది. సమస్యలన్నీ నక్సలైట్ల ప్రజా కోర్టులకు పోతే పోలీసులకు ఆదాయమూ రాజకీయ నాయకులకు ప్రాబల్యమూ పోతాయి. సంప్రదాయక సామాజిక విలువలు తల క్రిందులయి వ్యవస్థ పునాదులే దెబ్బతింటాయి. నక్సలైట్ కార్యకర్తలు ఎక్కువగా దళిత కులాలకు చెందిన యువకులు. వాళ్ళు పంచాయతీలు చేయడమే ఒక సామాజిక అపచారం. పైగా వాళ్ళు చెప్పే తీర్పులు ఆధిపత్య వర్గాలకూ వాళ్ళ అవసరాలకూ వ్యతిరేకంగా వుంటాయి. ఈ కారణాల వల్లసమాంతర ప్రభుత్వంఅంటూ పెద్దలంతా గొడవ చేస్తున్నారు. ఎవరికి వారు తమకు అందినకాడికి సమాంతర ప్రభుత్వాలు నడుపుతూనే వుంటారు గానీ హరిజన గిరిజన కూలీ యువకులు ఆ పని చేస్తే అది ఘోరం అయిపోతుంది. వాళ్ళు కొన్ని చోట్ల చేస్తున్న తొందరపాటు చర్యలను ఆసరా చేసుకొని గొడవ చేస్తున్నారు. పులి వెందుల రాజశేఖరరెడ్డి నుండి పులిమామిడి రామచంద్రారెడ్డి దాకా వాళ్ళు నడుపుతున్నవి సమాంతర ప్రభుత్వాలు కావా?

**ప్రజా కోర్టుల పేరిట నక్సలైట్లు కాళ్ళూ, చేతులూ నరకడం లాంటి ఆటవిక తీర్పులు చెప్పడాన్నీ, ఆధిపత్యం కోసం సోదర నక్సలైట్లను అమానుషంగా హత్యచేయడాన్నీ మీరెందుకు ఖండించరు? ఈ దారుణాలకు పాల్పడే నక్సలైట్లను శిక్షించమని ఎందుకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయరు?**

ప్రజా ఉద్యమాలు చేసే పోరాటాల్లకూ ప్రభుత్వం ప్రయోగించే అణచివేతకూ తేడా చూడడం అవసరం. మొదటిది రాజకీయ సమస్య, రెండవది పౌర హక్కుల సమస్య. ప్రజా ఉద్యమాలు పోరాటాల్లు చేస్తే - అవి ఎంత ఘోరమయిన పోరాటాలయినా - వాళ్ళను విమర్శిస్తాం, సక్కదిద్దే ప్రయత్నం చేస్తాం. ప్రజా కోర్టులలో కొన్ని చోట్ల జరుగుతున్న తప్పుడు చర్యలనూ, ప్రజలలో పని చేసేవాళ్ళు పరస్పరం చంపుకోవడాన్నీ, కిడ్నాప్ చేసుకోవడాన్నీ, దూషించడాన్నీ తప్పని విమర్శిస్తూ వున్నాము. సవరించే ప్రయత్నం మాలాంటి వాళ్ళు చేయగల మేరకు చేస్తున్నాము. ప్రభుత్వం ప్రయోగించే అణచివేత వేరే కోవకు చెందిన విషయం. దానిని నిర్ద్వంద్వంగా ఖండిస్తాము, వ్యతిరేకిస్తాము, అందుకోసం ఉద్యమాలు నిర్మిస్తాము.

**నక్సలైట్లు పంచిన భూములు పేదలకు నిలుస్తాయా? దాని వల్ల వారిని మరిన్ని చిక్కుల్లోకి నెట్టినట్టవదా?**

గత 70 సంవత్సరాలలో ఏజెన్సీ ప్రాంతాలలో దాదాపు 4 లక్షల ఎకరాల అడవి భూమిని గిరిజనులు నక్సలైట్ల మద్దతుతో కొట్టుకున్నారు. దానిని నిలుపుకున్నారు. అనుభవిస్తున్నారు. మైదాన ప్రాంతాలలో అంత సులభం కాకపోవచ్చు. బలవంతంగా రిజిస్ట్రేషన్ చేసినా అది బలవంతంగా జరిగింది అని కోర్టుకు పోయి భూస్వాములు వెనక్కి తీసుకోవచ్చును. ఎంత మేరకు జరుగుతుందనేది బలాబలాలను బట్టి వుంటుంది. భూముల పంపకం ఒక పోరాటమయితే దానిని నిలుపు కోవడమూ ఒక పోరాటమే. అది తప్పని సరిగా విఫలమవుతుందని అనుకోనక్కరలేదు.

**పునః ప్రారంభమైన ఎన్‌కౌంటర్ల దృష్ట్యా మీరు చెన్నారెడ్డికి ఇచ్చే సలహా ఏమిటి?**

పాత సలహాయే మళ్ళీ ఇవ్వడం తప్ప మేము చేయగలిగింది లేదు. ప్రజలకుండే సమస్యల నుండి ఉత్పన్నం అయ్యే ఉద్యమాలను అణచివేతతో ఎదుర్కోవడం తప్పేకాక నిష్ప్రయోజనం కూడ. ఎన్‌కౌంటర్లు ఎన్ని చేసినా మరిన్ని చేయవలసిన అవసరం మాత్రమే మిగులుతుందని సలహా ఇస్తాం.